క్లుప్తంగా

నిత్యావసరాలు సక్రమంగా పంపిణీ చేయాలి



నిత్యావసర సరుకుల స్టాక్‌ని పరిశీలిస్తున్న వీఆర్‌ఓ తంగరాజ్

పాలసముద్రం: తెల్లరేషన్ కార్డుదారులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ సుబ్బులక్ష్మి తెలిపారు. సోమవారం తహసీల్దార్ ఆదేశాల మేరకు శ్రీకావేరిరాజుపురం చౌక దుకాణాన్ని వీఆర్‌ఓ తంగరాజ్ తనిఖీ చేశారు. వీఆర్‌ఓ తంగరాజ్ మాట్లాడుతూ నిత్యావసర సరుకులు 1 నుంచి 15వ తేదీలోగా ప్రతి రేషన్‌కార్డుదారునికి నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ముఖ్యంగా తూకాల్లో తేడాలు లేకుండా డీలర్లు చూడాలని తెలిపారు. అనంతరం నిత్యావసర సరుకుల స్టాక్ రికార్డుని పరిశీలించారు. కార్యక్రమంలో డీలర్ సుబ్రమణ్య నాయుడు పాల్గొన్నారు.

23న మడకెద్దులు పుస్తకావిష్కరణ

తిరుపతి కల్చరల్: తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం రచించిన మడకెద్దులు పుస్తకావిష్కరణ సభ ఈనెల 23వ తేదీన ఉదయం 9.40 గంటలకు ఎస్వీయూ గ్రంథాలయంలోని సెమినార్ హాల్లో నిర్వహిస్తున్నట్లు తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షురాలు గంగవరం శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షుడు తమటం రామచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాయలసీమ అధ్యయనాల సంస్థ అధ్యక్షుడు భూమన్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత మధురాంతకం నరేంద్ర, గౌరవ అతిథిగా సినీగేయ రచయిత, గాయకుడు పుట్టా పెంచలదాసు, ఆత్మీయ అతిథులుగా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు సాకం నాగరాజు హాజరవుతారన్నారు. కార్యక్రమానికి రచయితలు, కవులు, భాషాభిమానులంతా హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.

ప్రయాణికులతో మర్యాదగా మెలగండి

- బస్సుల కండీషన్ బాధ్యత డ్రైవర్లదే
- మెకానిక్‌లు ప్రతి బస్సును తనిఖీ చేయాలి



చెంగల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి

తిరుపతి అర్బన్: ఆర్టీసీ సర్వీసుల్లో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులతో కండక్టర్లు గౌరవంగా నడుచుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక ప్రాంతమైన తిరుపతితో పాటు జిల్లాలోని పలు పుణ్యక్షేత్రాలకు దేశ విదేశాల నుంచి భక్తులు వచ్చిపోతుంటారని చెప్పారు. వారితో మర్యాదగా వ్యవహరించాలని వివరించారు. మరోవైపు ప్రయాణికులు కండక్టర్లతో చిల్లర విషయంలో సహకరించాలని కోరారు. ఆర్టీసీ అంటే సురక్షిత ప్రయాణానికి నిదర్శనమన్నారు. ఈ క్రమంలో ప్రతి డ్రైవర్ ప్రయాణం చేయడానికి ముందు బస్సు కండీషన్ చెక్ చేసుకోవాల్సి ఉందని తెలిపారు. మరోవైపు గ్యారేజీకి వచ్చే ప్రతి సర్వీస్‌ను నిశితంగా మెకానిక్‌లు తనిఖీ చేయాలన్నారు. అవసరం అయితే కొత్త విడిభాగాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సమిష్టిగా పని చేస్తేనే ప్రమాదాలకు దూరంగా ఉంటూ విజయవంతంగా ఆర్టీసీ నడిపించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు రాయపనేని హరికృష్ణ మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ ఏడాది మామిడి పంట పూర్తిగా దెబ్బతిందన్నారు. మరోపక్క గుజ్జు పరిశ్రమ యజమానులు, వ్యాపారులు కుమ్మక్కై రైతులను నిలువున దోచుకుంటున్నారని వాపోయారు. తోతాపురి టన్ను రూ.28 వేలు పలుకుతున్నప్పటికీ కేవలం రూ.23వేలకే కొనుగోలు చేస్తున్నారని మండిపడ్డారు. తోతాపురి టన్నుకు రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా రైతులతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సురేంద్రనాథ్, సీనియర్ నాయకులు వెంకటరత్నం ఏఐకేఎంఎస్ తిరుపతి జిల్లా అధ్యక్షులు వెంకటయ్య, ఉమాపతి నాయుడు వెంకటరమణారెడ్డి, సుదర్శన్ నాయుడు, మహిళా సంఘం నాయకులు లత పాల్గొన్నారు.

పెద్దశేష వాహనంపై ప్రసన్నుడి వైభవం

- ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు



పెద్దశేష వాహనంపై భక్తులను కటాక్షిస్తున్న శ్రీవారు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ధ్వజారోహణంతో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 6.55 నుంచి 7.25 వరకు మిథున లగ్నంలో వైఖానసాగమోక్తంగా ధ్వజారోహణ ఘట్టాన్ని వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామాస్మరణల నడుమ ఆలయ ప్రధాన అర్చకులు కంకణభట్టార్, సూర్యకుమారాచార్యులు వైభవంగా నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు చేపట్టారు. నూతన వస్త్రంపై గరుత్మంతుడిని లిఖింపజేసి, పూజలు చేసి ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. ముక్కోటి దేవతలను 18 గణాలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడమే ధ్వజారోహణ ఘట్టం ఆంతర్యమని అర్చకులు వివరించారు. అంతకుముందు తెల్లవారుజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి శుద్ధి, కొలువు, తోమాలసేవ, అర్చన, మొదటి గంట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ధ్వజారోహణం అనంతరం ఉదయం 8 గంటల నుంచి 8.30 వరకు అర్చకులు స్వామివారి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. తదుపరి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు స్వామి, అమ్మవార్లకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 వరకు ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం శ్రీవారు వాహన మండపంలోకి వేంచేపు చేశారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని ప్రత్యేక పుష్పాలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

పెద్దశేష వాహనంపై ప్రసన్న వేంకటేశ్వరుడు..

బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు రాత్రి 7 గంటలకు పెద్దశేష వాహనంపై ప్రసన్న వేంకటేశ్వరస్వామి శ్రీదేవి, భూదేవి సమేతుడై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. మాడవీధుల్లో స్వామివార్లకు పెద్దసంఖ్యలో భక్తులు నారికేళ కర్పూర హారతులు ఇచ్చారు. వాహన సేవ అనంతరం స్వామివారికి ఏకాంతసేవ నిర్వహించారు. డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఏఈఓ రమేష్, ఆలయ సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు చిన్నశేష వాహనంపై స్వామివారు దర్శనమిస్తారు. సాయంత్రం 5.30 నుంచి 6.30 వరకు ఊంజల్‌సేవ, రాత్రి 7 గంటల నుంచి 8 వరకు హంసవాహనంపై స్వామివారు విహరిస్తారు.



ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేదపండితులు



తిరుచ్చిపై శ్రీవారు



స్వామివారికి తిరుమంజన సేవ

కనుల పండువగా ద్రౌపదీ కల్యాణోత్సవం



మహాభారత హరికథా గానం పాడుతున్న షణ్ముఖి

పాలసముద్రం: మండలంలోని క్రిష్ణజిమ్మాపురం గ్రామంలో వెలసిన ధర్మరాజుల స్వామి ఆలయంలో మహాభారత ఉత్సవాలలో భాగంగా నాలుగో రోజు సోమవారం ద్రౌపదీ సమేత ధర్మరాజుస్వామికి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారి కల్యాణోత్సవానికి కుమార్‌రెడ్డి, ప్రమీల దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ అర్చ కులు వేద మంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం వైభవంగా జరిపారు. భక్తులు తమిళనాడు, కర్ణాటక, మండల పరిధిలోని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం కథకురాలు పూర్ణ షణ్ముఖి, సుబ్రమణ్యం బృందం హరికథా గానం భక్తులను అలరించింది.

ఆకట్టుకున్న పండరి భజన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట గ్రామంలోని మైక్రోవేవ్ స్టేషన్ కాలనీలోని గ్రామదేవత గంగమ్మ జాతరను పురస్కరించుకుని సోమవారం భక్తులు చేసిన పండరి భజన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గంగమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. కాలనీవాసులు పొంగళ్లు పెట్టారు. అనంతరం అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

విద్యుత్ సమస్యలపై ఫోన్ చేయండి

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలపై ఫ్యూజ్ ఆఫ్ కాల్‌కు ఫోన్ చేయాలని ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ ఇన్‌చార్జి ఈఈ మునిచంద్ర తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్‌కు 1912కు ఫోన్ చేయవచ్చన్నారు.

- నగరం–మిట్టూరు సెక్షన్ పరిధిలోని ఏఆర్ టాప్‌లైన్, గూల్సింగ్ పేట, కొండమిట్ట, మాదా గుడివీధి, పొనియమ్మన్ వీధి, చర్చివీధి ప్రాంతాలకు ఏఈ (9440811825), గిరింపేట సెక్షన్ పరిధిలోని బాలాజీనగర్, గొడుగుమూరు, ఇరువారం, జానకరాపల్లె, శంకరయ్యగుంట, ప్రశాంత్‌నగర్ వాసులు ఏఈ (9440811826), సంతపేట పరిధిలోని డీఐరోడ్డు, హైరోడ్డు, జెండామాను, మార్కెట్‌వీధి, గంగనపల్లె, చవటపల్లె పరంగా ఏఈ (9400811830), కొంగారెడ్డిపల్లె పరంగా కట్టమంచి, లాయర్స్‌కాలనీ, ఎస్టేట్, బాపూజీనగర్, వెంగళ్రావుకాలనీ, పోలీసు కాలనీ, బీవీరెడ్డి కాలనీ, లక్ష్మీనగర్ కాలనీవాసులు ఏఈ(9440811827) లేని పక్షంలో డీఈ (9440811824)ను సంప్రదించాలన్నారు.
- రూరల్– 2 సబ్‌డివిజన్– ఆవులకొండ సెక్షన్ పరిధిలో ఎ.కాలేపల్లె, కేవీపురం, ముకలటూరు, పాచిగుంట, వేపంజేరి, వింజం వాసులు ఏఈ (9440811837), జీడీనెల్లూరు పరిధిలో 100 గొల్లపల్లె, ఎ.కొండేపల్లె, దామరగుంట, ఈ.కలవ, ఎట్టేరి, గారంపల్లె, కలిజివేడు, కొట్రకోన, నల్లేపల్లె, పి.కలవ, వేల్కూరు వాసులు ఏఈ (9440811838), పెనుమూరు పరిధిలోని బలిజపల్లె, గుంటిపల్లె, జీబీ పల్లె, కేసీపల్లె, కలువగుంట, కలికిరి, ఎల్‌కేపీ ఊరు, లంకెపల్లె, మత్తంపల్లె, పులికల్లు, ఎస్‌ఆర్ పల్లె, తిరుపల్లె వాసులు ఏఈ నంబరు 9440811839, పూతలపట్టు పరిధిలో ఆకనంబట్టు, బైటపల్లె, బండార్లపల్లె, బొసిపల్లె, చామంతిపరం, చిట్టిపిరాల, ఈసీపల్లె, గొడుగుచింత, కేజీపల్లె, కేఆర్‌పురం, కాలెపల్లె, కొత్తకోట, ఎల్‌కేపూరు, ఎం బండపల్లె, ముత్తిరేవుల, నారాయణపల్లె, పాలకూరు, పేటమిట్ట, పోలవరం, రామాపూరం, తానేపల్లె, వావిల్‌తోట, వేపనపల్లెవాసులు ఏఈ నంబరు 9440811840, పాలసముద్రం పరంగా ఎ.మంగపురం, ఆముదల, ఎ.పుత్తూరు, జీఎంపురం, జేఎల్‌పురం, కే.రామాపురం, కొత్తకండిగ్ర, కే.జన్మపురం, మామిడిమానుమూల, మత్తవలం, మిధినాథ, నరసింహపురం, ఆర్‌కేపురం, ఎస్‌ఆర్ కండ్రిగ, ఎస్‌ఆర్ పురం, టీవీఎస్ పురం, టీఆర్ పురం, వనదుర్గాపురం, వెంగలరాజుకుప్పం వాసులు ఏఈ నంబరు 9440811841, లేని పక్షంలో డీఈ 9440811836 సంప్రదించాలన్నారు.
- రూరల్స్–3 సబ్ డివిజన్–కొత్తపల్లెలో ఏఎల్‌పురం, బి.సముద్రం, సి.బండపల్లె, చీలాపల్లె, చిత్తపార, గుడిపాల, ఎస్.మంగళం, పానాటూరు, పేయనపల్లె, రామాపురం, రెట్టగుంట వాసులు ఏఈ నంబరు 9440811832, రెడ్డిగుంట పరిధిలో అన్నుపల్లె, జి.బండపల్లె, ఎల్‌బీపురం, మాపాక్షి, నరిగిపల్లె, ఎన్‌ఆర్ కండ్రిగ, పెద్దిశెట్టిపల్లె, తుమ్మింద, వైఎస్సార్ నగర్, ప్రశాంత్‌నగర్, ఎన్‌సీబీ కాలనీవాసులు ఏఈ నంబరు 9440811828, చిత్తూరు రూరల్స్ పరంగా 36 గొల్లపల్లె, అనంతాపురం, బీఎస్‌ఆర్ పేట, చింతలగుంట, దిగువమాసపల్లె, దొడ్డిపల్లె, గాండ్లపల్లె, కే చెర్లోపల్లె, కుర్చివేడు, మురకంబట్టు, ముత్తూకూరు, ఓబనపల్లె, పాచిగుంట, పంట్రాంపల్లె, పూనేపల్లె, సిద్ధంపల్లె, టి.వేపనపల్లె, తాళంబేడు ప్రాంతాలవాసులు ఏఈ నంబరు 9440811829 నంబరు లేని పక్షంలో డీఈ 9493174269 లేదా టోల్ ఫ్రీ నంబరు 1912 నంబరు సంప్రదించాలని వివరించారు.

అసాంఘిక చర్యలకు పాల్పడితే కేసులు



పిచ్చాటూరు ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణలో ఖాళీ మద్యం సీసాలు తొలగిస్తున్న సిబ్బంది

పిచ్చాటూరు: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. స్థానిక ఇరిగేషన్ గ్రౌండ్‌తో పాటు ఆర్‌అండ్‌బీ కార్యాలయ ఆవరణలో కొందరు ఆకతాయిలు రాత్రిళ్లు మద్యం సేవిస్తున్నట్టు ఫిర్యాదులు అందడంతో ఆయన సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వల్ల దొంగతనాలు, మహిళలపై అఘాయిత్యాలు తదితర నేరాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. గత ఏడాది అక్టోబర్‌లో స్థానిక ఫాల్ట్రీ కాంప్లెక్స్ వద్ద యువకులు మద్యం సేవించి ఒక వ్యక్తిని హత్య చేశారని గుర్తు చేశారు. ఇరిగేషన్ గ్రౌండ్, ఆర్‌అండ్‌బీ కార్యాలయ ఆవరణలో ఉన్న మద్యం సీసాలను తొలగించారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ఆకతాయిలపై కేసు నమోదు చేయడంతో పాటు రౌడీషీట్ తెరుస్తామని హెచ్చరించారు. ఏఎస్‌ఐ వెంకట్‌రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



చదువు నేర్పించిన గురువులతో పూర్వ విద్యార్థులు

పాలసముద్రం: అత్తిమాంజేరిపేట ప్రభుత్వ పాఠశాలలో 2000–2001 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం ఏజే పేట కల్యాణ మండపంలో సమావేశమయ్యారు. 23 ఏళ్ల తరువాత ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో స్థిరపడిన స్నేహితులు కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యను బోధించిన గురువులను సన్మానించారు. గురువులు వరదరాజులునాయుడు, సురేంద్రబాబు, హేమభూషణం, నరసింహ మందడి, సుగుణకుమారిలకు పాద పూజలు చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. పూర్వ విద్యార్థులు వారి కుటుంబ వివరాలు, ప్రస్తుతం వారు చేస్తున్న పనులను ప్రతి ఒక్కరూ వేదికపై పంచుకున్నారు. అనంతరం అంతా కలసి సహపంక్తి భోజనాలు చేశారు. పూర్వ విద్యార్థులు మునస్వామి, మురళి, రాజేంద్రబాబు, రమేష్, గౌతమి, అనిత తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి పాదాల ప్రతిష్ఠాపన



పూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక పాతకలెక్టరేట్ ఆవరణలోని శ్రీ కామాక్షి అంబికాదేవి సమేత శ్రీ సదాశివేశ్వరసామి దేవాలయంలో సోమవారం మూలవర్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఏకాదశి నాడు వెంకటేశ్వరస్వామి విగ్రహం ముందు ఉదయం ప్రత్యేక పూజలు చేసి పాదాలను ప్రతిష్ఠించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

త్యాగనిరతికి చిహ్నం బక్రీద్



గంగాధర నెల్లూరు: మసీదు ఆవరణలో మతగురువుతో ముస్లింలు



నగరి : మీరాసాహెబ్‌పాళెంలో బక్రీద్ నమాజ్ చేస్తున్న ముస్లింలు

నగరి : త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ వేడుకలు నగరిలో సోమవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి పట్టణంలోని ముస్లింలు నూతన వస్త్రాలతో కోలాహలంగా కనిపించారు. బక్రీద్ పండుగను అత్యంత ఉత్సాహంగా జరుపుకున్నారు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం చివరి నెల జిల్ హిజ్జ పదో రోజున ఈ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక జామియా, మక్కా మసీదులో అధిక సంఖ్యలో ముస్లింలు హాజరై ప్రత్యేక నమాజ్ చేశారు. ముస్లింలు ఖుర్బానీ చేసిన మాంసంలో ఒక భాగాన్ని సొంతానికి, ఒక భాగాన్ని పేదలకు, ఒక భాగాన్ని బంధువులకు పంచిపెట్టారు. మధ్యాహ్నం తమ నివాసాల సమీపంలో ఉన్నవారికి భోజనం అందించారు. మండలంలోని మీరాసాహెబ్‌పాళెం, వేలావడి తదితర గ్రామాల్లో ముస్లింలు అధికంగా ఉండడంతో బక్రీద్ సందడి కనిపించింది.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

పుత్తూరు: పట్టణంలో బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక తిరుపతి రోడ్డు, గేట్‌పుత్తూరు, షాపువీధిలోని ఈద్గా మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని పొట్టేలు, మేకపోతు మాంసాన్ని ఖుర్బాని పేరిట పేదలకు పంచి పెట్టారు. తిరుపతి రోడ్డులోని మసీదు వద్ద ముస్లింలు బక్రీద్ ప్రాముఖ్యతను తెలియజేశారు. త్యాగానికి ప్రతీక బక్రీద్ అని, ముస్లింలు విధిగా నమాజు చేయాలని సూచించారు. నీతి నిజాయితీతో జీవించాలని, హింసా ప్రవృత్తికి దూరంగా ఉండాలన్నారు. సేవాగుణంతో పదిమందికి చేయూతనివ్వాలని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

గంగాధర నెల్లూరు: మండలంలో ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీడీ నెల్లూరులోని అబ్బాస్ కాలనీ, ఆవలాపూర్, బాలగంగానపల్లి, తూగుండ్రం పంచాయతీ ఆవలకొండలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గాలో మత పెద్దలు బక్రీద్ పండుగ గురించి వివరించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

కార్వేటినగరంలో...

కార్వేటినగరం: మండలంలోని ముస్లింలు సోమవారం బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముస్లిం కాలనీలోని మసీదులో ముస్లింలు చిన్న పెద్ద తేడా లేకుండా ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. పలువురు మసీద్ ఆవరణంలో పేదలకు దానధర్మాలు చేపట్టారు. మసీదు, దర్గాలతో పాటు, ముస్లిం కాలనీ వీధులను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.



పుత్తూరులో ఈద్‌ముబారక్ చెప్పుకుంటున్న ముస్లింలు



పుత్తూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



బాలగంగానపల్లి మసీదులో ప్రార్థనలు

సప్తగిరీశునికి సంకీర్తనలతో నీరాజనం



సంకీర్తనలు గానం చేస్తున్న కళాకారుల బృందం

తిరుపతి కల్చరల్: నామసంకీర్తనల గానాలాపనతో కళాకారులు సప్తగిరీశునికి భక్తి నీరాజనాలు అందించారు. మనోవికాస్, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంయుక్త ఆధ్వర్యంలో యశోదనగర్‌లోని వేమన విజ్ఞానకేంద్రంలోని ఆడిటోరియంలో ఏడు రోజుల పాటు తలపెట్టిన నిరంతర సప్తగిరి సంగీత సప్తాహం సోమవారంతో రెండోరోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా రాష్ట్రం, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రముఖ సంగీత కళాకారులు తమదైన శైలిలో భక్తి నామ సంకీర్తలను ఆలపించి ప్రేక్షకుల హృదయాలను రంజింపజేశారు. ఈ మేరకు తొలుత హైదరాబాద్‌కు చెందిన జొన్నలగడ్డ శ్రీరాం బృందం, తిరుపతికి చెందిన కొమాండూరి వెంకట కృష్ణ బృందం, వై.పరమేశ్వరయ్య, విజయవాడకు చెందిన వేమూరి వేంకట విశ్వనాథశాస్త్రి సుమధురంగా సంకీర్తనలను గానం చేసి శ్రోతలను అలరింపజేశారు. తర్వాత గురజాగ మధుసూదనరావు, మురళీకృష్ణ, పి.శైలజ, చల్లా ప్రభావతి, కొమాండూరి శేషాద్రి బృందాలు ప్రదర్శించిన గాత్ర కచేరీలు సభికులను ఆకట్టుకున్నాయి. తమిళనాడు తిరువణ్ణిక్కవల్ కళాకారులు, చెన్నైకి చెందిన జ్ఞాన సురభి మ్యూజిక్ అకాడమీ కళాకారులు, రాజమండ్రికి చెందిన సత్యనారాయణ బృందం సంప్రదాయ నామ సంకీర్తనామృతంతో ఆధ్యాత్మికతను రేకెత్తించారు. కళాబృందాలను నిర్వాహకుడు పున్నమరాజు మురళీకృష్ణ ఘనంగా సత్కరించి అభినందించారు.



నామ సంకీర్తన ఆలపిస్తున్న కళాబృందం